## బాధిత కుటుంబానికి పరామర్శ



చెలిమిల్లలో పరామర్శిస్తున్న ప్రమోద్‌రెడ్డి

పెబ్బేరు/గోపాల్‌పేట, నవంబర్ 6: మున్సిపాలిటీ పరిధిలోని చెలిమిల్లలో గుండెపోటుతో మృతిచెందిన బీఆర్ఎస్ నాయకుడు పెద్దిగారి కురుమూర్తి కుటుంబాన్ని సోమవారం నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి పరామర్శించారు. కురుమూర్తి మృతి పార్టీకి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. అలాగే, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే గోపాల్‌పేటమండలంలోని ఏదుట్లకు చెందిన రామలచ్చమ్మ (55) మృతి చెందింది. సోమవారం మృతురాలి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. వారిలో సర్పంచ్ శ్రీలత, ఉపసర్పంచ్ క్రాంతిరావు, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు యాదగిరి, శ్రీనువాసులు, లింగం తదితరులు ఉన్నారు.

## నేడు బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

వనపర్తి, నవంబర్ 6: జిల్లాకేంద్రం సమీపంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధికారి ప్రతినిధి వాకిటి శ్రీధర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహించే సమావేశంలో ఎన్నికల సమాయత్తంపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్నిస్థాయిల ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, రైతుబంధు సమితి అధ్యక్షులు, సింగిల్ విండో అధ్యక్షులు, పార్టీ శ్రేణులు, పట్టణ, మండల, గ్రామ కమిటీల మహిళలు, యువత, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు మెంబర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులు హాజరుకావాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ఖిల్లాఘణపురం, నవంబర్ 6: గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ రేణుక, డీపీఎం అరుణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఉప్పరపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధరను కల్పిస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. రైతులకు కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం, సీసీ, వీవో తదితరులు పాల్గొన్నారు.

## కనీస అవగాహన నైపుణ్యాలు పెంచుకోవాలి

వనపర్తి టౌన్, నవంబర్ 6: విద్యార్థులు కనీస అవగాహన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకే తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో వలంటీర్లకు పిల్లల కోసం తొలిమెట్టు అనే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో డ్రాప్ అవుట్ తగ్గించి, హాజరు శాతాన్ని పెంచేందుకు విద్యార్థుల్లో కనీస అవగాహన నైపుణ్యాలను నేర్పేందుకు ఈ తొలిమెట్టు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కళాశాల నుంచి 150 మంది డిగ్రీ విద్యార్థులు ప్రతి శనివారం జిల్లాలో కేటాయించబడిన ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి విద్యాబోధన చేస్తారని చెప్పారు. ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఆటపాటల ద్వారా అభ్యసించేందుకు వారికి నచ్చిన అంశాలలో విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రూప, మంజులు, విద్యార్థినులు తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

వనపర్తి రూరల్, నవంబర్ 6: మండలంలోని మెంటెపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో సుదర్శన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పిల్లలకు ఎలాంటి పోషకాలతో కూడిన ఆహారాన్ని పెడుతున్నారని అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు, గుడ్లు, బియ్యం, నిత్యావసర సరుకులకు పరిశీలించారు. పిల్లలకు పౌష్టిహారాన్ని అందించాలని, చలికాలంలో పిల్లలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతక ముందు సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీలను సందర్శించి మొక్కల పెరుగుదల, తడి, పొడిచెత్తపై కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు.

# సాయం చేసే సర్కార్‌కు అండగా నిలవాలి

- *మంత్రి నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి*
- *పల్లెనిద్రలో మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి*

గోపాల్‌పేట, నవంబర్ 6: అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్ సర్కార్‌కు ప్రజలంతా అండగా నిలవాలని, ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆశీర్వదించి వనపర్తి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని మరోమారు భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి కోరారు. సోమవారం ఆమె మండలంలోని పొల్కెపహాడ్‌లో కూతురు తేజస్వినితో కలిసి పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. సాయంత్రం గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల నేపథ్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులకు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రచార సమయంలో ఆమె గ్రామస్తుల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. రాత్రి గ్రామంలోని దళితవాడలో గ్రామస్తులతో కలిసి భోజనం చేసి, అక్కడే బస చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భార్గవి, ఎంపీపీ సంధ్య, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ రజని, ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ రత్నకుమారి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాములు, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు తిరుపతి యాదవ్, గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోదండం, మహిళా కమిటీ అధ్యక్షురాలు అనురాధ, శశికళ, ఎస్సీసెల్ అధ్యక్షుడు రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పొల్కెపహాడ్‌లో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేస్తున్న సింగిరెడ్డి వాసంతి

### గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం

పెబ్బేరు, అక్టోబర్ 6: మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం కొనసాగుతున్నది. నాయకులు, కార్యకర్తలు నిత్యం ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. ఉదయం నుంచి వీధిల్లో తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు చురుగ్గా పాల్గొంటున్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా మ్యానిఫెస్టో ప్రతులను ప్రతిఒక్కరికీ పంపిణీ చేస్తున్నారు.

### బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

గోపాల్‌పేట, నవంబర్ 6: ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న, ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించి కారు గుర్తుకు ఓటువేయాలని కోరారు. చెన్నూరులో నిర్వహించిన ప్రచారంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మొగులాలు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరావు, నాగరాజు, నాగయ్య, మహేశ్, దామోదర్‌రెడ్డి, బాలస్వామి, దేవేందర్, సురేశ్ పాల్గొన్నారు.



అయ్యవారిపల్లెలో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు



చెన్నూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ఎన్నికల ఖర్చులను పకడ్బందీగా లెక్కించాలి

- **నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజేంద్రసింగ్**



అధికారులతో సమీక్షిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజేందర్‌సింగ్

వనపర్తి, నవంబర్ 6: నియోజకవర్గంలోని ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను పకడ్బందీగా లెక్కించాలని నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజేంద్ర సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీలోని అకౌంటింగ్ హాల్లో ఎన్నికల వ్యయ, ఎంసీఎంసీ కమిటీతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి రాజకీయ పార్టీలు అనేకమార్గాలు అన్వేషిస్తుంటాయన్నారు. ఎప్పటికప్పుడు డేగ కళ్లతో వాటిని పరిశీలిస్తూ.. ప్రలోభాలను పసిగట్టి అరికట్టాలని సూచించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు గట్టి ప్రయత్నాలు చేయాలన్నారు. అదేవిధంగా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు పకడ్బందీగా ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరింత పకడ్బందీగా తనిఖీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిట్ అధికారి శ్రీనివాస్, డీపీఆర్వో సీతారామ్, సహాయ వ్యవయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు క్రీడాకారుల ఎంపికలు

వనపర్తి టౌన్, నవంబర్ 6: జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అథ్లెటిక్ విభాగంలో క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని ఎస్జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాలికలకు అథ్లెటిక్స్‌లో మూడు క్రీడల్లో ఈ ఎంపికలు ఉంటాయని చెప్పారు. క్రీడల్లో పాల్గొనే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు జికార్స్‌తో ఉదయం 9గంటలకు బాలకిష్టయ్య క్రీడా మైదానంలో హాజరుకావాలని సూచించారు.

# పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- ***కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్***

కొత్తకోట, నవంబరు 6: పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలతోపాట 7వ వార్డులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సోమవారం సాయంత్రం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధానంగా దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపు, మౌలిక సదుపాయాలు, సరైన వెలుతురు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులను పరిశీలించారు. దండుగడ్డతోపాటు ఉర్దూమీడియం, డ్వాక్రా మహిళా రాఘవేంద్ర కాలనీలో ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. అక్కడ ఉన్న విద్యార్థులకు కలెక్టర్ నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, హెచ్ఎం, డీటీ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### తగిన ఏర్పాట్లు చేయాలి

మదనాపురం, నవంబర్ 6: పోలింగ్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు తిర్మలాయపల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఏర్పాట్లు సంబంధించిన పూర్తి వివరాలను మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, అవసరమైన అన్నిఏర్పాట్లు ముందుగానే పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో నాగేంద్రం, డీటీ అశోక్, బూత్‌లెవల్ అధికారులు ఉన్నారు.



మదనాపురంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్